# శ్రీమతీ నా ప్రేమకథ వినవూ!

'భరణిశ్రీ'

కొంతమందికి కొన్ని విచిత్రమైన కోరికలు!

అలాగే మా ఆవిడ : నా ప్రేమ కథ చెప్పాలని ఎంతో తాపత్రయం. మా ఆవిడ మీద నా కున్న ప్రేమ సంగతి కాదు. ఆమెతో పెళ్ళి కాక ముందు ఊహానుభవంతో నేను వెలిగించిన ప్రేమ జ్యోతిని ఆమె ముందుంచాలని.

చెప్పాలనుకున్న వాణ్ణి డైరెక్టుగా శ్రీమతికి చెప్పెయ్యకుండా ముందు మిత్రులకు చెప్పాను. బ్రహ్మాండమైన స్టంటుతో, సినిమా వాళ్ళకుకూడా అందని సంఘటనలతో కూర్చిన ఆ ప్రేమ కథని మా వాళ్ళు నిజమే ననుకుని, "వద్దు, గురూ, ఇలాంటివి నిజ భార్యలకు చెప్ప కుండా ఉంటేనే మంచిది. చాలా డేంజరు. ఆ తరవాత నీకు రేపటు అన్న మాట ఉండదు. సీరియస్‌గా తీసుకుంటే, కాపురమే ఉండదు" అన్నారు.

"అలా తెలివి తక్కువ దద్దమ్మలా 'చెప్పనా ఈ ప్రేమ కథ' అని అడుగుతా వేం? అయితే, పెళ్ళికి ముందు మీ ఆవిడ ఎవర్నో ప్రేమించి, కారణాంతరాల వల్ల నిన్ను చేసుకుందని తెలిస్తే నీ పరిస్థితి ఏమిటి? మవ్వేమై పోతావు? పిచ్చి వేషాలు కట్టి పెట్టి నీ ప్రేమ కథని పూర్తిగా మరిచిపోయి, పెళ్ళాన్ని ప్రేమించు" అంటూ ముఖం మీద కొరడా ఝుళిపించాడు ఓ అంతరంగిక మిత్రుడు.

ఈ సలహాలు విన్నాక నా ఉబలాటాన్ని కంట్రోలు చేసుకున్నాను.

కాపురం పోతుందన్న భయం ఉన్నా, ప్రేమ కథ చెప్పాలన్న చెడ్డ తపన మాత్రం పోలేదు.

ఆ విషయమే మా మిత్రుంతో అంటే "ఏదో వినాశానికే పుట్టింది నీ కీ బుద్ధి. చిలక్కి చెప్పినట్లు చెప్తాం. వినక గోతిలో దిగుతావంటే ఆపక తొయ్యందించే వాళ్ళుకూడా ఉండరు". అన్నారు నిష్ఠూరంగా.

'ఏ విషయమైనా ఎవరికి వారికి అనుభవమైతే కాని అసలు సంగతి తెలియదు' అన్న నానుడి ఎంత కాలంగానో అందరూ చెప్పుకొంటున్నదే. నే నందుకు వ్యతిరేకిని కాను; కాలేను.

మా శ్రీమతి నా కర్థం కాని, ఓ పెద్ద చిక్కు విడని మిష్టరీ!

ఎందుచేతనంటారా? ఏ సమయంలో ఎప్పు డెగిరి పడుతుందో ఆమెకే తెలియదంటే అందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఒక్కో మాటకి ఏ సందర్భంలో ఏ అర్థం ఉన్నదో ఉచ్చారణ బట్టి అయినా గ్రహించలేం మనం. . సారీ. . . నేను.

ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరవుతా రన్న అసామీ ఎవరో ఆ మాట మా శ్రీమతిని దృష్టిలో పెట్టుకోకుండా గబుక్కున అనేశాడు.

ఆ రేమిటి? రెండు అర్థాలు నిండుతున్నాయి.

మా ఆవిడ ముందు నే నెప్పుడూ ఎర్లీ వర్క్సెస్ అయినా, టోటల్ ఫెయిలయ్యారే.

నేను సిగరెట్లు కాల్చనవే మా శ్రీమతి గర్వాన్ని అణచాలని, ఓ సిగరెట్టు వెలిగించి, మొదటి పీల్చిన పొగాని కంటే, గింగిరాలు తిరిగి, మా ఆవిడ ముంగిట నాలి, 'సిగరెట్టు జోలికి పోను, రాజ్యం' అంటూ మా శ్రీమతి అడక్కుండానే ఏలీయమైన ఒట్టు వేశాను, ఓడిపోయాననే మనసులో నన్ను తిట్టుకుంటూ.

అన్నట్టు, చెప్పటం మరిచాను. నాకు చాలా ప్రేమ (యుగళ) గీతాలు వచ్చు. ప్రేమైక్యంలో లీనమై తన్మయత్వంతో పాడగలను.

నాకో కోరిక ఉండేది—'వచ్చే భార్యకి కూడ పాట లొస్తే ఎంత బాగుండునూ', అని.

ఎందుకంటే, నే నెపుడో షేవు చేసుకుంటూ, 'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని' అంటుంటే, వంటింట్లోంచి ఆవిడ 'కన్నులలో దాచుకొందు నిన్నే నా స్వామీ' అంటూ అందుకుంటుందని.

మా ఆవిడకీ పాటలు వచ్చు. కాని, అవి ఎక్కువగా భక్తి పాటలు, హారతి పాటలు, జోల పాటలు. ఇప్పట్లో పనికి వచ్చేవి కావు. నాకు వచ్చిన సినిమా పాటల్ని నాతో కలిసి పాడటానికి శ్రీమతి ఒప్పుకోలేదు. 'ఛీ, పాడు' అనేది. అసలు నేర్చుకోనంది.

ఓ సారి నేను పూర్తిగా విషాదాన్ని పులికి పుచ్చుకుని (నటుణ్ణి కూడా కదా) కళ్ళు అదో రకంగా పెట్టి, గురుపాదులు శ్రీ మల్లాది వారి నా కెంతో ఇష్టమైన 'కనుపాప కరవైన కనులెందుకూ' (ఈ విషాదం పాట ఒక్కటి నేర్చగలిగాను. నేర్చుకున్నాకే సరిగ్గా భోజనం చేశాను) తన వారే పరులైన బతుకెందుకూ' అని భారంగా మొదలు పెట్టాను. ఎంత సేపటికీ ఆవిడ పాడక పోయేసరికి కళ్ళు సరిగా పెట్టి చూడ్డాను కదా—విరగబడి నవ్వుతూ, "ఎందుకో మీరే చెప్పండి" అంది.

అంతే! మూడ్ మారిపోయింది. ఆశ అడుగంటింది. కోరిక కొండెక్కింది.

ఇలా మా ఆవిడతో యుగళ గీతాల దాష్టరు ముగిసి పోవటంతో నా స్వకల్ప ప్రేమ కథ చెప్పి, ఆ ప్రేమ తరంగాల్లో ఊగిన రాధాలన్న కాంక్ష ప్రబలిపోయింది.

మా ఆవిడ పెద్ద హాస్యప్రియ. మా చుట్టు పక్క అందరి లోనూ చిన్నదైనా ఆవిడ మాటలు వినాలని అనేకసంది గంటల తరబడి 'శిలాప్రతిమ'ల్లా నుంచుండి పోతారు.

ఒకసారి శ్రీమతి హాస్యాయణంలో ఉండగా, ధైర్యంగా 'రాజ్యం' అని పిలిచాను. వెంటనే 'మా వారు పిలుస్తున్నా'రంటూ రయ్యమని ఇంట్లోకొచ్చి 'మంచి పని చేశారండి. వదిలించుకోలేక చస్తున్నా' అంటూ ముద్దు గ్రాంటు చేసి లోపలి కెళ్ళింది. పొంగి పొరలి పోయాను.

అదే సందర్భంలో మరోసారి పరిరించి ధైర్యంగా 'రాజ్యం, ఇలా రా. ఎంతసేపలా' అన్నాను. ఇంకేం ఉంది? టకటక లోపలి కొచ్చింది. "మీకు బుద్ధి ఉందా? పరువు తీశారు కదండీ. ఆ రాధాబాయిగా రున్నప్పుడా లోపలికి పిలవటం? అయినా, మీ కిప్పు డేం తక్కువైంది? నా కెంత అమర్యాద, ఎంత సిగ్గుచేటు, చ చ! పాడు బతుకు" అని దుయ్య బడుతూ కళ్ళు నీళ్ళెట్టుకుంగి రాజ్యం. అవాక్కైపోయాను.

అందుకే మా ఆవిడ 'మూడ్స్' అంటే నాకు నమ్మకం లేదు.

ఈ పాటి నన్ను మా శ్రీమతి 'మాట' కింద కట్టేసి ఆడిస్తుందో కాని ఈ పాటికి మీరు, ఎప్పుడో సీను అనుమాన పడ్డా, అలాంటి ఆధారాలు లేవు. ఎందుచేతనంటే, ఎంతో సన్ప్రగా పిలుస్తూ, స్వయంగా... చేసినా నాకు విశదపరిచి నా ... పొందటం, పలుగురిలో 'మా వారు ఊరుకోరు, తిడతారు. వారి నడిగి చెబుతాను' అంటూ నా పరువు నిలపటం, ఉత్తమ గృహిణిగా 'ప్రాణం, ప్రాణం' ... పాటలు, ...ఓహో! ... మంచి గుణాలున్న ఆవిడ సొంతమైనాయి.

ఇక మా ఆవిడకు 'తెలిసేదేమిటీ' అంటే నా ప్రేమకథ వినే అవకాశం!

అయినా, ఏను చెప్పద్దూ...

అప్పుడికీ రెండు మూడు సార్లు హాస్యంగా ట్రై చేశాను. "మీరు మరో అమ్మాయిని ప్రేమించటమేమిటి? మీ ముఖం!" అని కొట్టి పారేసింది.

ఆడవాళ్ళు చిలవలు, పలవలు చేసుకునే ఈ ప్రేమాయణం కథని తేలిగ్గా తీసి పారేయటం, 'తన రాక ముందు జరిగిన విషయం' అని నేను చెబుతుంటే నాలిక చప్పరించటం చూస్తుంటే నా మీద ఉన్న నమ్మకమే నని అనిపించక మానదు. అయినా, నా ప్రయత్నాలు మానలేదు

'గతంలో నేను మరో అమ్మాయిని ప్రేమించాను' అని చెప్పి ఊరుకోవాలని కాదు నా ఉద్దేశం! ఆ అమ్మాయితో నేను చేసిన ఊహా * షికార్లు, కల సినిమాలు, రాయని ప్రేమ లేఖలు 'వివరించి' ఆ అమ్మాయి పెళ్ళికి వెళ్ళి ఆ జంటను ఆశీర్వదించి, విషాదంగా 'నీ సుఖమే నే కోర్కున్నా' అని పాడుకున్నానని చెప్పాలని.

మా శ్రీమతికి 'ఈ ప్రేమ కథను చెప్పి అసలు ప్రేమని. . .

అదేమిటో?


'పక్క వారిని ప్రేమించుము' అన్న సూక్తిని అక్షరాలా నిజం చేస్తూ విశాఖపట్టణంలో చదువు కుంటున్నప్పుడు పక్కింటమ్మాయిని ప్రేమించి కూర్చున్నాను. నా ప్రేమ సంగతి మాటలతో కాని, చేతలతో కాని ఆమెకు చెప్పనే లేదు. కనీసం కళ్ళతో నైనా పలకరించ లేదు. ఓ మంచి ముహూర్తం చూసుకుని ఆ అమ్మాయి సుబ్బరంగా 'అత్తారింటికి దారేదమ్మా సందామామా' అనుకుంటూ వెళ్ళిపోయింది. నా దారిన నేను చదువు ముగించుకుని, పుట్టింటికి వచ్చి, ఉద్యోగస్థుణ్ణి అయ్యాక 'ఓహో, పెళ్ళాం నా, నా ముద్దుల పెళ్ళామా' అంటూ రాజ్యం మెడలో పుస్తె బిగించాను.

ఇంతవరకు గతంలో నా అవిడ గురించి, నా ప్రేమ కథ చెప్పనీయని కారణాల గురించి చెప్పాను.

ప్రస్తుతంలోకి వస్తే—

మా పెళ్ళయి సంవత్సరం నిండిన సందర్భంగా ఈ రోజు తొలి రేయిలా దివ్యంగా గడపాలనుకున్నాను. ఈ సందర్భంగా నైనా నా ప్రేమ కథ చెప్పుకోవాలనుకున్నప్పటికీ, 'ఈ తియ్యటి రోజున అదెందుకు లెద్దూ' అనుకుని నా మటుకు నేను మరిచి పోయాను.

ఉదయాన్నే లేచి ఇద్దరం తలంటి పోసుకుని స్వీటు చేసుకున్నాం. ఉషారుగా


ఫోటో — ఎస్. ఎస్. రావు (మద్రాసు—78)
శీతలం

ఆఫీసుకి బయలు దేరుతూ ముద్దు ఒకటి పొందికగా బుగ్గ మీద అమర్చి 'రాజ్యం! ఇవాళ ఏడింటికే లైటాఫ్' అన్నాను. రాజ్యం ముసి ముసిగా నవ్వింది

ఆ ఆలోచనలతోనే ఆఫీసునుండి హడావుడిగా పూల మార్కెట్ దాటి, వెనక్కి వెళ్ళి పూలు కొనుక్కుని ఇంటి ముందు వాలాను. హతాశుడ నయ్యాను!

రాజ్యం వరండాలో కూర్చుని. . . ఓ చెంబు పక్కన పెట్టుకుని. . . అదీ దృశ్యం!

నా వంక అదోలా చూసింది, తనూ బాధ పడుతూంది, పాపం' అనుకున్నాను.

అందమైన ఈ పొద్దుంకాలం ఇలా 'టర్న్' అయినందుకు ఎంతో విచారించాను లైట్లన్నీ వేసుకుని 'పెనుచీకటాయె, లోకం' అంటూ.

ఆశలన్నీ ఆవిరై పోగా, ఆ వంటేదో చెయ్యి కాల్చుకుని, రాజ్యానికీ పెట్టాను.

"ఆ చాప ఇలా పడేయండి." అడిగింది రాజ్యం. "మీమంచంకూడా ఇక్కడే వేసుకోండి. కాసేపు కబుర్లు చెప్పుకుందాం" అంది.

అక్షరాలా పాటించాను.

నడుం వాల్చా, మా ఆవిడ ప్రారంభించింది.

"మన పెళ్ళి అనగానే శోభనం గుర్తుకు వస్తుంది. ఆ రోజు సంఘటన గుర్తుకు వస్తుంది. మీరు అలిగా రనగా నాకు రెండు నిమిషాలు కొయ్యబారి పోయాను. ఘోరమైన ఏడ్చేద్దా మనుకున్నా, మీరు కొత్త మనిషాయె. నిభాయించుకుని సోఫా వైపు నడిచాను. అయినా, అంతటి అమృత ఘడియల్లో అంత క్రూరంగా ఎలా నటించా రండీ ఇప్పుడు నా కళ్ళ ముందు అదే కనపడుతూంది" అంది బెంగా. (అనుకున్నాను)

అవును మరి, ఆవేళటి నా నటన. ఎవరో చెప్పితేనూ, తొలి రేయి మరిచి పోలేని సంఘటన సృష్టిస్తే, జీవితాంతం గుర్తుగా ఉంటుందని అనుకు జరిపాను.

అసలేం జరిగిందంటే—

నేను ముందుగా గదిలో కూర్చుని, మల్లెల సౌరభాన్ని ఆఘ్రాణిస్తూ, క్షణ మొక యుగంగా, ముఖం వీలైనంత క్రూరంగా పెట్టుకుని ఉన్నాను.

రాజ్యం వచ్చింది నెమ్మదిగా అడుగులో అడుగుతో.

"ఆగక్కడ" పరవాలేదుబానేఅన్నాను.

చివుక్కున తల ఎత్తింది రాజ్యం

"సిగ్గు, బిడియం కట్టిపెట్టు. నేనేదో నిజం చెబుతాను విను." ప్రొఫెసర్ లేఖన్నా డైలాగులు బాగానే వస్తున్నాయి.

"నే నేదో నిన్ను అందలం ఎక్కిస్తానని, అపురూపంగా చూసుకుంటానని ఆశ పడబోకు. ఈ పెళ్ళి నా కిష్టం లేదు. మన్నాను. అదిగో ఆ సోఫాలో నువ్వో, నేనో తెల్లు వరకు." కఠినంగా నటించాను.

రాజ్యం కాటుక కళ్ళల్లో నీళ్ళు. . .

"అయితే, నన్నెందుకు చేసుకున్నారు? తెలిసి నా గొంతు ఎందుకు కోశారు?" లాంటి మాటలు అంటుందేమో నని ఎదురు చూశాను.

అలా అనక పోయేసరికి నే చదివిన రచయిత్రుల నవలల్లోని సంఘటనలు, ఆడవాళ్ళ తిరుగుబాటు పాలక్కి అను కున్నాను. గొంతు కోతలు, అన్యాయాలు డైలాగుల్లోని మాటలే నని పొరపాటుగా తెలుసుకున్నాను.

ఉన్నట్టుండి ఏమనుకుందో సోఫా వైపు నడిచింది.

నేను ఆగలేక 'రాజ్యం' అన్నాను.

వెనుతిరిగింది.

నవ్వాను. . . నవ్వలేదు.

"ఇదంతా నటన, రాజ్యం, నటన . . . నువ్వేమంటావో నని. ఉత్తరాల్లో తెలియలేదా నువ్వంటే నా కెంత ప్రేమో . . ." అంటూ ప్రిపేరు కాని రకరకాల అనునయాలు వల్లించి, రాజ్యాన్ని దారిలోకి లాక్కొచ్చే సరికి చందమామ మబ్బుల్ని నెక్కిరిస్తూ టాటా చెప్పి, సూర్యుడికి ఆకాశ సీటు ఖాళీ చేశాడు.

ఆ తరవాత దాదాపు రోజూ 'భయపడ్డావా' అని అడిగేవాణ్ణి. రాజ్యం ఏదో చెపుతుండేది

ఓ రోజున "మీరు నటన లోనే కాని, నిజంగా అలాంటి పిచ్చి వేషాలు వెయ్యలేరని నాకు తెలుసు. ఇక ముందు నటించలేరు. కల్ల బొల్లి కబుర్లు చెప్పలేరు. ప్రయత్నిస్తే భంగ పడతారు, జాగ్రత్త" అంది నెత్తి నెక్కిందు కున్నందుకు దక్షిణగా మొటారంగా మొట్టుతూ.

జీవితాంతం గుర్తుండే సంఘటన మాటేమో కాని, నా ప్రేమ కథకు చెప్పనివ్వక పోవటానికి ఇదో కారణం!

నా గురించి నే నేం చెప్పినా నమ్మదు.

"వాళ్ళే, ఊరుకోం డురూ" అంటుంది అనునయంగా, ఆరాధనగా.

"నోరు మూయ్యండి" అంటుంది మెల్లగా, మత్తుగా.

ఇప్పుడు రాజ్యం మళ్ళీ ప్రస్తావించింది ఆ విషయం! జాలిగా ఆమె వంక చూశాను.

తరవాత ఏవో కబుర్లలో పడిపోయాం.

చివరికి 'ఆశ నిరాశను చేసితివా' అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాను.

తెల్లవారింది కాబోలు. . . ఎవరో కుదుపుతుంటే ఉలిక్కి పడి లేచాను.

"రాజ్యం. . . ఏమిటిది?" నేను స్నానం చెయ్యాలి కాబోలు. . . ఇవన్నీ తరవాత కాబోలు. . .

"కళ్ళు తిరుగుతున్నాయండి. . . ఇప్పుడే చిన్న వాంతి అయింది" అంది కంగారుగా.

"అయ్యో, అదేమిటి?" నిన్నటి స్వీటు వికటించింది గాబోలు, వెధవ హల్వాతో చేశా మనుకుని, "మరి డాక్టరు దగ్గర కెడదామా" అన్నాను.

తల ఊపింది రాజ్యం.

ముందు ఆరోగ్యం ముఖ్యం. అంతా కలిపి ఒక్కసారి స్నానం చెయ్యొచ్చనుకుని రిక్షా తెచ్చాను.

రాజ్యం వీక్‌గా ఉంది. పట్టుకుని నడిపించాను

డాక్టరు రాజ్యాన్ని టెస్టు చేశాక "కంగ్రాచ్యులేషన్స్" అంటూ గుండె అదిరిపోయే విషయం చెప్పింది.

రాజ్యం అలవోకగా చూసి అదోలా నవ్వింది.

ఎంత మోసం? ఎంత నటన? దారిలో "ఏం రాజ్యం, నే నింకా ఇంటికెళ్ళి స్నానం చెయ్యా లనుకున్నాను. ఆ నీళ్ళేవో నువ్వే పోసుకున్నా వన్నమాట" అన్నాను జోకు పేలుస్తూ.

ఇంటి కొస్తూనే

"రాజ్యం, సొగసైన దొంగా, రాత్రి నన్నెందు కలా ఏడిపించావు" అన్నాను కౌగిల్లోకి తీసుకుని ఉక్కిరి బిక్కిరి చేస్తూ.

"నే నేడిపిస్తే మీరు ఏడవటం ఎందుకు? నాకు 'ఆ వేళటి' సంఘటన గుర్తు లేదనుకున్నారా? రాత్రి గుర్తు చేశాను. మీరు పది నిమిషాలు నటిస్తే, నేను పది గంటలు నటించాను. ఆడదాన్ని కాబట్టి అనుకోకుండా దొరికి పోయాను. లేకపోతే అయిదు రోజులూ దూరంగా ఉంచి, నా కసి తీర్చుకునే దాన్ని. అయినా, మీ భార్యని కదా— ఆ మాత్రం తీర్చుకో వద్దా" అంటూ ఎదురు ప్రశ్నించి, మరో మాటకు తావియ్యకుండా పెదవుల నందించింది. ఇదో విద్య! కోపాన్ని రూపు మాపటం!

'ముదితల్ నేర్వగ రాని విద్య గలదే' అనుకోవటం తప్ప నే నేం చెయ్యగలను?

మా మిత్రులు నేను తండ్రి నవుతున్నా నన్న సంగతి తెలిసి 'వీడి ప్రేమ జ్వరం దిగిపోతుంది' అన్నారు.

ఇప్పుడు మా శ్రీమతికి నా ప్రేమ కథ వినే తీరిక లేదు. అప్పుడే ఉయ్యాలా, స్వెట్టర్లూ అంటూంది. నేను మాత్రం ఆ ప్రేమ కథని కలల్లో, ఊహల్లో చెప్పేస్తున్నాను. మా ఆవిడ భయంగా వేసిం దనుకున్న ప్రశ్నలకు కఠినంగా జవాబులు కూడా చెపుతున్నాను.

ఇంతకీ మీ కెప్పుడూ నా ప్రేమకథ చెప్పలేదు కదా! ఎక్కడండీ, చూస్తూనే ఉన్నారుగా! మా శ్రీమతి చెప్ప నిస్తేనా?

నా కల్పనాయుత ప్రేమ కథని మా ఆవిడతో ఎప్పుడు చెప్పుకుంటానో చదువు దామని ఆశగా ఎదురు చూసే వాళ్ళకి మా శ్రీమతితో బాటు ఆ ప్రేమ కథని వీలు చూసుకుని మరో సారి మనవి చేస్తాను. ఈ సారికి క్షమించండి. ✳

